క్లుప్తంగా

రేపు మండలమీట్

గుర్రంకొండ: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 10తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సీతమ్మ అధ్యక్షతన మండల మీట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు,ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

మనోహర్‌కు కమిషనర్‌గా పదోన్నతి



మదనపల్లె: మదనపల్లె సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీలో కేటగిరి–3 మేనేజర్‌గా పనిచేస్తున్న పీఆర్.మనోహర్‌కు కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వుజారీ చేసింది. దీనితో ప్రభుత్వం కమిషనర్‌గా బదిలీ చేయనుంది. కాగా మనోహర్ కదిరి, పుంగనూరు మున్సిపాలిటీల్లో పనిచేయగా బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్‌గా ఏడాదిపాటు పని చేశారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

రామసముద్రం : మండల పోలీసులు డ్రోన్ కెమెరా సహాయంతో కోడిపందెం రాయుళ్లను గుర్తించారు. నారిగానిపల్లి పంచాయతీ పూల కుంటపల్లి గనసమీపంలోని అటవీ ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక పందెపు కోడి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ పేర్కొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలకు నిమ్మనపల్లె విద్యార్థులు


చైతన్య


నిఖిల్


ఉదయ్‌కుమార్

నిమ్మనపల్లె : జిల్లాస్థాయి చెస్ పోటీలకు నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్(తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం అంజద్‌అలీఖాన్ తెలిపారు. మదనపల్లె మండలం సీటీఎం హైస్కూల్‌లో జరిగిన డివిజన్‌స్థాయి చెస్ పోటీల్లో అండర్–17 విభాగంలో కే.నిఖిల్, అండర్–14 విభాగంలో ఉదయ్‌కుమార్ ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులు నిఖిల్, ఏ.చైతన్య ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నారన్నారు. ప్రత్యేక బహుమతి కింద ఒకొక్కరికి రూ.2వేల నగదు లభిస్తుందని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు పాఠశాల పీడీలు శ్రీనివాస్, శారదలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రహదారికి మరమ్మతులు


రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

బి.కొత్తకోట: మండలంలోని బి.కొత్తకోట–చలిమామిడిరోడ్డులో డేగానిపల్లె వద్ద వాగు ప్రవాహంతో రోడ్డుకు ప్రమాదం ఉందని సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆర్‌అండ్‌బీ డీఈఈ సూర్యనారాయణ స్పందించారు. రోడ్డుపై మట్టితో పటిష్టంగా పనులు చేయించారు. దీనితో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మల్లెల పంచాయతీ చిన్నమేకలవారిపల్లి సమీప ప్రాంతంలో జూదం జోరు అధికంగా సాగుతోందని పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ హరిహరప్రసాద్ గురువారం సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించగా ఎనిమిది జూదరులు పట్టుబడ్డారని ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడిలో జూదరులతో పాటు వారి వద్ద లభించిన 22,850ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని ఎస్‌ఐ వెల్లడించారు.

చేనేతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

గాలివీడు : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు వీర భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేతన్నల గుంత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలన్నారు. అలాగే ప్రతి నేతన్న కుటుంబానికి రూ.25,000 చేనేత భరోసా ఇవ్వాలని, 50 సంవత్సరాలు పైబడిన నేతన్నలకు పింఛను మంజూరు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేనేతలను విస్మరించిందని విమర్శించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి


చౌకదుకాణాన్ని తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్


తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యలను తెలుసుకొంటున్న జేసీ

జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్

గుర్రంకొండ : ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి వారి సమస్యలను స్వయంగా తెలుసుకొన్నారు. మండలంలోని తరిగొండ గ్రామంలో తమకు చెందిన భూముల్ని వేరే వ్యక్తుల పేరుతో ఫ్రీహోల్డ్ చేశారని రైతులు ఫిర్యాదు చేశారు. అరిగెలవారిపల్లెలో పొలాలకు వెళ్లే దారి సమస్య చాలా ఏళ్లుగా అలాగే ఉందని ఎన్నోమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారుల సమావేం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతుల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ భూములు ఇతరులకు విక్రయించినవారు, డీకేటీ భూములు అనుభవదారుడు కాకుండా వేరేవ్యక్తులు అనుభవిస్తుంటే అలాంటి భూములను ఫ్రీహోల్డ్ చేయవద్దన్నారు.

రేషన్ సరకులు సకాలంలో పంపిణీ చేయాలి

రేషన్ సరుకులను సకాలంలో కార్డుదారులకు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ అన్నారు. బుధవారం పట్టణంలోని మూడవ చౌకదుకాణంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా బియ్యం నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఏఏ వస్తువులు చౌకదుకాణాలకు వస్తున్నాయో అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ రేషన్ కార్డులు ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అందజేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చేరేషన్ సరకులను సక్రమంగా పంపిణీ చేయాలని డీలరుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్న లక్ష్మీ, ఆర్‌ఐ సదాశివప్పనాయుడు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలి


మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాజీ ఎమ్మెల్యే చింతల, తదితరులు

కలికిరి(వాల్మీకిపురం): పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం తీసుకురావాలని రాష్ట్ర మాజీ మంత్రి, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నట్లు ఆ పార్టీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. పుంగనూరు నియోజకవర్గం సదుం మండలంలోని మాజీ మంత్రి స్వగ్రామం యర్రాతివారిపల్లిలో బుధవారం ఆయనను మాజీ ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా పార్టీ, అనుబంధ విభాగాల నియామకాలు పూర్తి చేసి ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు చెప్పారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ పెద్దిరెడ్డి స్వగృహంలో జరిగిన ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ పీలేరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నీళ్ళ భాస్కర్, వాల్మీకిపురం మండల పార్టీ కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, విఠలం సురేష్‌రెడ్డి, పులి క్రిష్ణారెడ్డి, రాజబాబు, శేఖర్‌నాయుడు, చంద్ర, భాస్కర పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలసిన పార్టీ మండల కన్వీనర్

పీలేరురూరల్ : మాజీ మంత్రి, పుంగనూరు శాసన సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సదుంలో మాజీ మంత్రిని కలసి మండంలోని వైఎస్సార్ సీపీ స్థితిగతులపై వివరించారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి కష్టపడి పని చేయాలని మాజీ మంత్రి సూచించారు.

జీఎస్టీ తగ్గింపుతో అనేక ప్రయోజనాలు


జీఎస్టీపై అవగాహన ర్యాలీ


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి

నిమ్మనపల్లె : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన కొత్త జీఎస్టీ సవరణలతో ప్రజలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిమ్మనపల్లె జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధర్ అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ...జీఎస్టీ 2.0 సవరణల్లో సుమారు 350కు పైగా వస్తువుల ధరలు తగ్గాయన్నారు. దీనివల్ల 140 కోట్ల మందికి ప్రయోజనం చేకూరిందని తెలిపారు. నిత్యావసర వస్తువులకు జీఎస్టీని తగ్గించడం వల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు మరింత లాభం చేకూరుతుందన్నారు. జీఎస్టీ తగ్గింపుల కారణంగా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా దేశ జీడీపీ పెరుగుతుందన్నారు. జీఎస్టీ స్లాబులు, వివిధ రకాల వస్తువులు, అవి వచ్చే శ్లాబులు, పడే పన్ను శాతంపై విద్యార్థులకు కూలంకుషంగా వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.రామాంజులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు రూరల్ : జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జీఎస్టీ సంస్కరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ విధానం పేద, మధ్య తరగతి ప్రజలకు వరం లాంటిదని తెలిపారు. సామాన్య ప్రజలు ఉపయోగించే అనేక రకాల నిత్యావసరాలపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు. మరికొన్ని వాటిపై 5 శాతం మాత్రమే పన్ను వేస్తున్నట్లు తెలిపారు. ఈ అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎం. వెంకటరమణయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా డివిజన్ స్కూల్‌గేమ్స్ పోటీలు




అండర్‌-17 బాలుర ఖోఖో పీలేరు విన్నర్స్ జట్టు, అండర్‌-14 బాలుర ఖోఖో మదనపల్లె విన్నర్స్ జట్టు

మదనపల్లె సిటీ: మదనపల్లె డివిజన్ స్కూల్ గేమ్స్ పోటీలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం డివిజన్ స్థాయిలో అండర్–14,–17 బాల,బాలికల ఖోఖో పోటీలు జరిగాయి. డివిజన్ పరిధిలోని 15 మండలా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.విజేతలు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో తంబళ్లపల్లె విన్నర్స్‌గా, రామసముద్రం రన్నర్స్ నిలిచింది .అండర్–17 బాలికల విభాగంలో రామసముద్రం విన్నర్స్‌గా, తంబళ్లపల్లె రన్నర్స్‌గా నిలిచాయి. అండర్–14 బాలుర విభాగంలో మదనపల్లె విన్నర్స్‌గా, రామసముద్రం రన్నర్స్‌గా నిలిచాయి. అండర్–17 బాలుర విభాగంలో పీలేరు విన్నర్స్‌గా, పీటీఎం రన్నర్స్‌గా గెలుపొందాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఝాన్సీరాణి, డివిజన్ కార్యదర్శి భద్రయ్య, శివశంకర్, పీడీలు దేవకమ్మ,అన్సర్, నరేష్, బాలాజీ, పార్థ, దిలీప్, మహేష్, ఉమా, మహేంద్ర, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

మదనపల్లె రూరల్ : మండలంలోని బసినికొండ పంచాయతీ వశిష్టస్కూల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నిమ్మనపల్లె మండలానికి చెందిన రంజిత్‌కుమార్ మృతికి పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమే కారణమని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్‌కుమార్ ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రోడ్డుకు మరమ్మతులు చేయడం, గుంతలు పూడ్చడంలో అధికారులు చూపిన నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం బలైందన్నారు. పాడైపోయిన రోడ్ల వల్లే దురదృష్టకర ప్రమాదం సంభవించిందన్నారు. మదనపల్లె–నిమ్మనపల్లె డబుల్‌రోడ్డుపై ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారే తప్ప కార్యరూపం దిశగా ప్రయత్నించిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మదనపల్లె–నిమ్మనపల్లె రోడ్డుమార్గంలో గుంతలు పూడ్చి మరమ్మతు పనులు చేయాలన్నారు. రంజిత్ కుమార్ మృతికి ప్రభుత్వం నుంచి తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

జీఎస్టీపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


వక్తృత్వ పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థిని

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో బుధవారం సూపర్ జీఎస్టీపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 52 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలలో మానవ వనరుల అభివృద్ధిపై డిజిటలైజేషన్ సాధికారికతపై అనేక ప్రసంగాలు విద్యార్థులు తమ పోటీలలో పేర్కొనడం జరిగింది. ఇందులో నాగమణి (హెచ్‌ఈసీ,ద్వితీయ సంవత్సరం) మొదటి బహుమతి, అస్మియా,(మొదటి సంవత్సరం సీఈసీ), శిరీష(మొదటి సంవత్సరం ఎంపిసి)లు ద్వితీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయిశివశంకర్‌రెడ్డి, శివపార్వతి, వెంకటరమణ, సతీష్ కుమార్‌రెడ్డి, మాలతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకి సత్కారం


మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

కేవీపల్లె : ఇటీవల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ మెంబరుగా పదవి పొందిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కేవీపల్లెకు చెందిన పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం మాజీ ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అడవిపల్లె రాజన్న, వెంకటరమణ నాయుడు, గురునాథ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం మండలం విఠలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చెంచురెడ్డి నాగార్జున రెడ్డి(42) మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం రాత్రి వారి స్వగృహానికి చేరుకుని నాగార్జునరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాగార్జున రెడ్డి మృతి తనకు తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన


తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న రమణమ్మ

తంబళ్లపల్లె: పుట్టిన చంటిబిడ్డలకు ముర్రుపాలే అమృతంలాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ తెలిపారు. బుధవారం కోటకొండ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. చంటి బిడ్డలకు తల్లి ముర్రు పాలు తాపినపుడు ఆ బిడ్డలకు వ్యాధినిరోధక శక్తి పెరిగి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వారి ఆయుషు కూడా పెరుగుతుందన్నారు. పౌష్టికాహారం విలువలను వివరించారు. హ్యాండ్‌వాష్, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలతో వండిన వంటకాలతో పౌష్టికాహార ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సునిత, శోభ, సుకన్య, గిరిజ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు


పశువైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసులునాయుడు

కలికిరి: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు లక్ష్యం మేరకు అన్ని పశువులకు వేయాలని పశుసంవర్ధకశాఖ మదనపల్లి ఏడీఏ శ్రీనివాసులునాయుడు అన్నారు. మండలంలోని మేడికుర్తి, పాళెం, మహల్, మర్రికుంటపల్లి, చీకటిపల్లి, గుండ్లూరు రైతు సేవా కేంద్రాలను ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం కలికిరి ప్రాంతీయ పశువైద్యశాలలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అమలవుతోన్న పథకాల అమలు, అర్హుల గుర్తింపు తదితరాలపై సమీక్షించారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డు, ఉపాధి హామీలో గడ్డి పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీఏ వెంకటమునినాయుడు, పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగరాజ

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు, ఆర్వో ప్లాంట్ల వాటర్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజుకు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా విన్నవించారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 46 మంది పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. పట్టణంలో 26 ఆర్‌వో ప్లాంట్ల ఆపరేటర్లకు 13 నెలలుగా జీతాలు అందలేదన్నారు. వారికి జీతాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అలాగే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవో బ్రహ్మానందరెడ్డి, వార్డు మెంబర్లు అబీద్, పరమేష్, నాగరాజనాయక్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ నినాదంతో ఎవరొచ్చినా స్వాగతిస్తాం


మాట్లాడుతున్న సాయిలోకేష్

మదనపల్లె: స్వదేశీ నినాదంతో ఏ పార్టీ ముందుకొచ్చి స్వాగతిస్తామని బీజేపీ జాతీయ, జిల్లా నేతలు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రతిఇంటా స్వదేశీ–ఇంటింటా స్వదేశీ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ జాతీయ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియాఖానం, కదిరి మాజీ ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడారు. దేశం స్వదేశీ స్వావలంబన సాధించేలా ప్రతిఒక్కరి కృషి అవసరమన్నారు. దేశ ఉత్పత్తులను వినియోగించడం, వాటికి అండగా నిలవడం జరగాలన్నారు. విదేశీ సాంకేతికకు ధీటుగా మనం అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనికోసం స్వాతంత్ర్య ఉద్యమంలా రాజకీయాలకు అతీతంగా స్వదేశీ ఉద్యమం జరగాలన్నారు. ప్రధాని మోదీ స్వదేశీ ఉద్దేశ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మహిళలకు అన్నిరంగాల్లో సముచిత స్థానంలో కల్పించడంలో మోడీ ముందున్నారని, దీనికి మహిళా రిజర్వేషన్లు నిదర్శనమన్నారు. సమావేశంలో బీజేపీ నేతలు బర్నెపల్లె రవికుమార్, బండి ఆనంద్, ఎన్.శోభారాణి, పులి నరేంద్రకుమార్‌రెడ్డి, చీర్ల శ్రీనివాస్, గజపతిరాజు, ఓసూరి కిరణ్ పాల్గొన్నారు.

స్టార్టప్‌లతోనే కొత్త ఉద్యోగ అవకాశాలు

రాజంపేట : కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖలో ఇంటర్ డిసిప్లినరీ సైబర్ – ఫిజికల్ సిస్టమ్ మిషన్ డైరక్టర్‌గా పనిచేసిన మాజీ శాస్త్రవేత్త డా.కెఆర్ మురళీని అన్నమాచార్య యూనవర్సిటీ ఛాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఎంపవరింగ్ అకాడమిక్ రీసెర్చ్ ఎమర్జింగ్ డొమైన్స్ అండ్ ఫండింగ్ ఆపర్చ్యునిటీస్ అంశంపై బుధవారం గెస్ట్ లెక్చరింగ్ ఇచ్చేందుకు అన్నమాచార్య యూనవర్సిటీకి విచ్చేశారు. ఈ సందర్భంగా చొప్పా గంగిరెడ్డిని డా.మురళీని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ శాస్త్రవేత డా.మురళీ మాట్లాడుతూ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల పరిశోధనలు ఉత్పత్తులుగా మారాలన్నారు. ఆ ఉత్పత్తులు ప్రోటోటైప్ రూపంలో అభివృద్ధి చెందితే అవి స్టార్టప్‌లుగా మారుతాయన్నారు. ఆ స్టార్టప్‌లు కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తాయన్నారు. కార్యక్రమంలో వీసీ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపల్ డా.నారాయణ, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వన్‌డిపోలో రికార్డు స్థాయిలో ఆదాయం


మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ–1 డిపో పరిధిలో సెప్టెంబర్ నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరినట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. సెప్టెంబర్ లో 647.93 లక్షలు ఆదాయం వచ్చి రీజియన్‌లో మొదటి స్థానం నిలించిందన్నారు. కెఎంపీఎల్ లో 5.35 వచ్చిందన్నారు. మరింత ఆదాయం పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీఐ వాలేనాయక్, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సత్కారం


డాక్టర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

పీలేరు : స్వచ్ఛతా సేవా 2025 అవార్డు సాధించిన పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. బుధవారం బిస్మిల్లా ఆటో యూనియన్ వారు పూల మాలలు, దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఆస్పత్రికి వచ్చి రోగులను, గర్భిణులకు ఉచితంగా ఆటోల్లో చేర్చడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో బిస్మిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు బోదేషావలి, యూనియన్ నాయకులు ముబారక్, రవి, హరినాథ, మస్తాన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

బెల్టు నిర్వాహకుడి అరెస్టు

రాజంపేట : పట్టణంలో బెల్టుషాపులు లేకుండా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రాజంపేట అర్బన్‌సీఐ నాగార్జున అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని బ్రహ్మంగారి గుడికి ఎదురుగా కొత్తమిషన్ వీధిలో బెల్టుషాపు నిర్వాహకుడు సింగమాల గంగాధర్‌ను అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 33 బ్రాందీ సీసాలు సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. పట్టణంలో ఎవరైనా బెల్టుషాపు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. వారికి సహకరించే వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్‌ఐ వర్మ, హెడ్ కానిస్టేబుల్ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి నివాళులు


నివాళులు అర్పిస్తున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : మండలంలోని పొన్నేటిపాలెం పంచాయతీ పనసమాకులపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్.రామాంజులు(68) గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం పనసమాకులపల్లె గ్రామానికి వెళ్లిన నిసార్‌అహ్మద్, రామాంజులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు రాజ్‌కుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పొన్నేటిపాలెం పంచాయతీలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి ఆర్.రామాంజులు, ఆయన కుమారుడు రాజు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామాంజులు మృతదేహానికి నివాళులర్పించిన వారిలో కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి, వైఎస్సార్ సీపీ నాయకులు రఘునాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శంకర్‌నాయక్, జబీవుల్లా, రాజేష్, రఘు, చిరు, శ్రీధర్, చిప్పిలి హరి తదితరులు పాల్గొన్నారు.

11న ఉచిత మెగా వైద్య శిబిరం

రైల్వేకోడూరు : మానవత రైల్వేకోడూరు శాఖ వారి సహకారంతో తిరుపతికి చెందిన అమర హాస్పిటల్ వారు ఈనెల 11వ తేదీ శనివారం రైల్వేకోడూరు టోల్‌గేటు వద్దనున్న హెచ్‌ఎంఎం హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవత సభ్యులు తెలిపారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యమే అంగన్‌వాడీలకు శాపం

రాయచోటి అర్బన్ : ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అష్టకష్టాలు పడుతున్నారని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి పేర్కొన్నారు. బుధవారం రాయచోటిలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సకాలంలో బయోమెట్రిక్ వేయకపోవడం, బిల్లులు ప్రభుత్వానికి పంపకపోవడం వల్ల అంగన్‌వాడీలకు 5 నెలలుగా కూరగాయల బిల్లులు, 4 నెలలుగా కేంద్రాల అద్దెలు అందలేదన్నారు. దీంతో అంగన్‌వాడీలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. స్టాక్ పంపిణీలోనూ జాప్యం జరుగుతోందన్నారు.